ప్రజాశక్తి
గురువారం 2 ఫిబ్రవరి 2023
5
విజయనగరం




రీ సర్వే ఆధారంగా ఆస్తుల హద్దులు నమోదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చేపడుతున్న రీ సర్వే ఆధారంగా సచివాలయాల పరిధిలో ఆస్తుల సరిహద్దులను పక్కాగా నమోదు చేయాలని ప్రణాళిక, అడ్మిన్ కార్యదర్శులకు సహాయ కమిషనర్ ప్రసాద్‌రావు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విధి విధానాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం అమలులో భాగంగా రిసర్వే ప్రక్రియను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రణాళికా కార్యదర్శులతో పాటు అడ్మిన్ కార్యదర్శులు టీమ్‌గా ఏర్పాటై సచివాలయ పరిధిలో ఉన్న ఆస్తుల సరిహద్దులను పక్కాగా నమోదు చేసుకోవాలని అన్నారు. దీనివల్ల ఖాళీ స్థలాల వివరాలు, నిర్మాణ భవనాలు, ప్రభుత్వ స్థలాలు కచ్చితంగా తెలిసే వీలుంటుందని అన్నారు. సమావేశంలో ఎసిపి అమ్మాజీ రావు, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

- గిరిజన వర్సిటీకి తగ్గిన బడ్జెట్
- తగ్గిన ఉపాధి నిధులతో ఇబ్బందులు ఎదుర్కోనున్న కూలీలు
- రైల్వే బడ్జెట్ పెంచినా జిల్లాకు సున్నా
- ఎస్‌సి, ఎస్‌టిలకూ తగ్గిన కేటాయింపులు
- ప్రస్తావనకు రాని ప్రత్యేక హోదా
- బయటపడ్డ కేంద్ర ప్రభుత్వ బండారం



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాపై మరోసారి వివక్ష ప్రదర్శించారు. కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్న గిరిజన వర్సిటీకి గత ఏడాది కన్నా నిధులు తగ్గించారు. ఎన్నోసార్లు సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి విన్నవించిన భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఎలాంటి సాయమూ అందించలేదు. వ్యవసాయం, కార్మిక సంక్షేమానికి, జాతీయ ఉపాధి హామీ వంటి అనేక రంగాలకు, పథకాలకు బడ్జెట్‌లో కోత విధించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని, అభివృద్ధిని కూడా కేంద్రం విస్మరించింది. ఆదాయ పన్ను పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించినప్పటికీ, అంతకన్నా ఎక్కువ ఆదాయం పొందినవారు రూ.3లక్షల నుంచీ పన్ను చెల్లించాల్సి వుంటుంది. గిరిజన ప్రాంతాల్లోని ఏకలవ్య పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని పూర్తి స్థాయిలో భర్తీచేస్తామని చెప్పడం ఊరటనిచ్చే అంశంగా పరిగణించవచ్చు.

జిల్లాపై వివక్ష

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా జిల్లాలోని కేంద్రీయ గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ సొంత భవనం లేదు. పరాయి పంచన తరగతులు నిర్వహిస్తున్నారు. లేబొరేటరీ, లైబ్రరీల కోసం ఇతర ప్రైవేటు కాలేజీలపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. సుమారు ఏడేళ్లగా స్థల సేకరణ పేరుతోనే కాలక్షేపం చేసింది. తాజాగా మెంటాడ మండలం కుంటినవలసలో స్థలాన్ని గుర్తించినప్పటికీ సేకరణ నత్తనడకన సాగుతోంది. అధునాతన విద్యా ప్రమాణాలతో వర్సిటీ అందుబాటులోకి రావాలంటే తక్కువలో తక్కువగా రూ.1200కోట్లు అవసరమౌతాయి. కానీ, గడిచిన నాలుగైదేళ్లగా రూ.22కోట్లు చొప్పున కేటాయిస్తోంది. ఈ నిధులు అడ్మినిస్ట్రేషన్, భోదన, భోధనేతర సిబ్బంది జీతభత్యాలకే సరిపోని పరిస్థితి.

ఇటువంటి తరుణంలో కనీసం వర్సిటీ నిర్వహణకైనా నిధులు పెంచాల్సిన కేంద్రం కేవలం రూ.18.50కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడం గమనార్హం. ఇక దేశవ్యాప్తంగా కొత్తగా 50 ఎయిర్‌పోర్టులు, ఎయిర్ ప్యాడ్స్ ఏర్పాటు చేయనున్నట్టు, విరివిరిగా కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన కేంద్రం జిల్లాలో తలపెట్టిన భోగాపురం ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టుకుగానీ, మెడికల్ కాలేజీకి గానీ ఎలాంటి సాయమూ అందించలేదు. మన జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేకపోవడం, సేవా రంగంలో ఎదుగుదల లేకపోవడం, వ్యవసాయరంగం ఉన్నా సాగునీటి వనరులు అభివృద్ధి చేయకపోవడం వంటి కారణాలతో చిన్నసన్నకారు రైతులు మొదలుకుని వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాలకు చెందిన వృత్తిదారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పనులు ఉపయోగించుకోవడంలో కొన్ని దశాబ్దాలుగా మన జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఇటువంటి తరుణంలో ఉపాధి హామీకి రూ.29,400కోట్లు తగ్గించడం కూలీలను కలవరపాటుకు గురిచేస్తోంది.

గత ఏడాది రూ.25వేల కోట్ల మేర తగ్గించి, నిబంధనలు కఠినతరం చేయడంతో అంతకు ముందు వరకు రూ.250 నుంచి రూ.257 వరకు వచ్చే కూలీల సగటు వేతనాలు, రూ.150 నుంచి రూ.157కు పరిమితమయ్యాయి. తాజా కోతలతో జిల్లా మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోనుంది. రైల్వే బడ్జెట్ భారీగా పెంచినట్టు చెప్పుకుంటున్నా ఆచరణలో వాల్తేరు డివిజన్, విజయనగరం రైల్వే స్టేషన్ల ప్రస్తావన ఎక్కడా లేదు. దీంతో, విజయనగరాన్ని మోడల్ స్టేషన్‌గా మారుస్తామన్న హామీ హుళక్కేనని మరోసారి స్పష్టమైంది.

పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని ఏకలవ్య పాఠశాలల్లో భోదన, బోదనేతర సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పడం ఊరట కలిగినప్పటికీ, అక్కడ భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల సంగతి ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా ప్రత్యేక హోదా, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు సహా వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి తదితరాలు కనీస ప్రస్తావనకు కూడా రాలేదు. మొత్తం వ్యవసాయ రంగానికి 22శాతం నిధులు కోత విధించడం, పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్యను అమాంతంగా కుదించడం వంటివాటితో రైతాంగం ఆందోళన చెందుతోంది. కుదేలవుతున్న చేనేత కార్మికులకు ప్రోత్సహంగానీ, కనీసం జిఎస్‌టి రాయితీగా లేదు. ఇలా అన్ని రంగాలపైనా భారాలు తప్ప, బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేకపోవడంతో రానున్న కాలంలో పేద, మధ్య తరగతి మరిన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్



నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కార్పొరేట్‌కు ఊడిగం చేసేదే. దానివల్ల సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఆదాయ పన్ను పరిమితి పెంచామని చెప్తున్నా ఆచరణలో దానివల్ల వేతన జీవులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక బడ్జెట్. బిజెపి మోసకారితనం బయట పడింది.

– తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

జిల్లాకు ఒరిగిందేమీ లేదు



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల మన రాష్ట్రానికి గానీ, జిల్లాకు గానీ ఒరిగిందేమీ లేదు. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గిరిజన వర్సిటీకి చాలా కాలంగా అరకొర నిధులే కేటాయించింది. ఈ ఏడాది కేటాయించిన రూ.18.50కోట్లు కంటితుడుపు చర్య. మన జిల్లా ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకంగావున్న ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల జిల్లా అభివృద్ధి కుంటుబడుతుంది. కూలీల జీవనంపైనా తీవ్రమైన ప్రభావం పడుతుంది.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్మన్

బడ్జెట్‌లో నిర్దిష్టతల్లేవు



కేంద్ర బడ్జెట్‌లో జిల్లా, రాష్ట్రానికి చేసిన కేటాయింపులు నిర్దిష్టంగా లేవు. దీనిపై గురువారం జరగబోయే బడ్జెట్ సవరణ సమావేశంలో నిలదీస్తాం. అలాగని మన రాష్ట్రానికి పెద్ద కేటాయింపులు కూడా చేయ లేదు. పోలవరం ఊసే లేదు. గిరిజన యూనివర్శిటీకి నిధులు తగ్గించారు. ఎయిర్‌పోర్టు, మెడికల్ కాలేజీలకు కూడా సాయం ప్రకటించలేదు.

– బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎమ్‌పి



సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన

ప్రజాశక్తి- వంగర

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, ప్రజావ్యతిరేక మైనదని, ప్రజలంతా తిరస్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. ప్రజలకు మేలు చేకూర్చని బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం రాజాంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందన్నారు. నిరుద్యోగాన్ని పోగొట్టడానికి గాని, పెరుగుతున్న ధరలను తగ్గించటానికి గాని, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గాని ఈ బడ్జెట్ సహాయపడదని అన్నారు. కార్మికుల కోర్కెలు తీర్చేందుకు ఈ బడ్జెట్ ఎటువంటి పరిష్కారం చూపలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్నభోజనం, జాతీయ ఆరోగ్యమిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధుల మిషన్ లకు మోడి ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని అన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల బడ్జెట్ లా ఉంది



కేంద్ర బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌లా, రాజకీయ ప్రయోజనాల కోసం రూపుదిద్దుకున్న బడ్జెట్‌లా కనపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు నైపుణ్య శిక్షణ కళాశాల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపడం అభినందనీయం. విశాఖ స్టీల్ ప్లాంట్ కు 653 కోట్లు కేటాయించడం శుభ పరిణామం. మరోవైపు పక్కన కర్ణాటకకు భారీ కేటాయింపులు చేయడం, తెలుగు రాష్ట్రాలకు అంతగా కేటాయింపులు చేయకపోవడం అన్యాయం. విభజన చట్టంలోని హామీల విషయం కానీ, ప్రత్యేకహోదా గురించి ప్రస్తావించకపోవడం, రైల్వే కారిడార్‌పై ఎలాంటి హామీ ప్రస్తావన లేకపోవడం సరికాదు. రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్లో కేటాయింపులు అర కొరగానే ఉన్నాయి.

- కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్

భవిష్యత్తుకు భరోసా కల్పించని బడ్జెట్



సామాన్యుల భవిష్యత్ కు భరోసా కల్పించని విధంగా కేంద్ర బడ్జెట్ ఉంది. అంకెల గారడీ తప్ప, అత్యధిక జనాభా అయినా సామాన్యులకు, పేద తరగతి వర్గాలకు, రైతులకు మేలు కలిగించేలా లేదు. వ్యవసాయ పరపతి సంఘాలు డిజిటిలైజేషన్ కోసం 2000 కోట్లు కేటాయించినా, గిట్టుబాటు ధర కల్పించడం కోసం గానీ, ప్రత్యేక యంత్రాంగం కోసం గానీ, రైతులకు పవర్ సబ్సిడీపై గానీ బడ్జెట్లో కేటాయింపులు లేవు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధిపై దృష్టి కేంద్రకరించలేదు. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తీసుకుని శ్రద్ధ ,జీవన భద్రత,సామాజిక భద్రత కోసం నిర్దిష్టమైన చర్యలు లేవు. దళిత ఆదివాసీలకు కూడా ఈ బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదు.

-పి.చిట్టిబాబు, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పండిన ధాన్యమంతా కొనుగోలు చేస్తాం

- వారం రోజుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీల భర్తీ
- జెడ్‌పి చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

రైతులవద్ద మిగిలి ఉన్న ధాన్యమంతటినీ కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి సమావేశ భవనంలో బుధవారం జరిగాయి. 1,2,4,7 సంఘాలకు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమాలను అడ్డుకొని, నిజమైన రైతులందరి వద్దనుంచీ ధాన్యం కొనుగోలు చేయడానికే, ఇటీవల ఫోటోలను తీయించామన్నారు. ఇంకా మిగిలిపోయిన ధాన్యాన్ని కూడా పూర్తిగా కొనుగోలు చేస్తామనిహామీ ఇచ్చారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా, ఇ-పంటలో నమోదైన మేరకు సుమారు 5.15లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రెండు జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధిపనులను నిర్వహించాలని ఛైర్మన్ ఆదేశించారు. రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేయాలని సూచించారు. పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థికసంఘం నిధులు, వాటి వినియోగం, పాఠశాలల మ్యాపింగ్, నాడూ-నేడు ఫేజ్-2 పనుల ప్రగతిపై చర్చించారు. జెడ్‌పి వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అధ్యక్షతన 3వ స్థాయీ సంఘ సమావేశం జరిగింది. వ్యవసాయంతోపాటు, పశు సంవర్థకం, పట్టు తదితర వ్యవసాయ అనుబంధ శాఖలపై చర్చించారు. వైఎస్‌ఆర్ సంచార పశు ఆరోగ్యకేంద్రం క్రింద ప్రతీ నియోజకవర్గానికి రెండోవాహనాన్ని మంజూరు చేసినట్లు చెప్పారు. జెడ్‌పి రెండో వైస్ ఛైర్మన్ కొ్రజన్ని సింహాచలం అధ్యక్షతన 6వ స్థాయి సంఘం, బొబ్బిలి జెడ్‌పిటిసి సభ్యురాలు శాంతకుమారి అధ్యక్షతన 5వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించి, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు సమావేశాల్లో ఎంఎల్‌సి డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్‌పి సిఇఒ డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, డిప్యుటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అధికారులు, ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

ప్రజలకు చేరువ కావాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కరూర్ వైశ్యా బ్యాంక్ ఫోర్ట్ బ్రాంచ్‌ను కలెక్టర్ సూర్య కుమారి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందించడంలో బ్యాంక్ లు ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, ఎజిఎం కరూర్ బ్యాంక్ రమేష్, చీఫ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, డా.సుదాకుమారి, బ్యాంక్ వినియోగదారుల పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను సక్రమంగా పంచుతున్నారా లేదా అని ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్ వీలుపర్తి గ్రామంలో బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులంతా పింఛన్లు సక్రమంగా అందుతున్నాయని చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనూష, వెల్ఫేఅసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బందితో పాటు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోల్లో తనిఖీ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి. కాంతారావు బుధవారం జిల్లాలో పర్యటించారు. అంగన్ వాడీ కేంద్రాలను, చౌకధరల దుకాణాలను , దాసన్నపేట లోని పౌర సరఫరాల గిడ్డంగిని , కస్పా స్కూల్ జగనన్న గోరు ముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. నాగోజిపేట 511 అంగన్వాడీ కేంద్రంలో ఐదుగురు పిల్లలు నమోదై ఉండగా గత 5 రోజుల్లో హాజరు పట్టిక లో ఖాళీ గా ఉండడాన్ని పరిశీలించి ఎందుకు హాజరు వేయలేదని ప్రశ్నించారు. పిల్లలు హాజరు కాలేదని కార్యకర్త చెప్పగా ఆబ్సెంట్ వెయ్యాలి కదా అన్నారు. అశ్రద్ధ గా విధులు నిర్వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని పీడీ శాంత కుమారికి సూచించారు. కస్పా హై స్కూల్ లో పిల్లల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు 50 శాతం కన్నా తక్కువగా ఉందని, పిల్లల్ని రప్పించేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం స్టోర్ రూమ్ లో నున్న స్టాక్ ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ తో పోల్చి 200 కేజీ ల బియ్యం తక్కువగా ఉన్నాయని గుర్తించి అందుకు గలా కారణం ఏంటని ప్రశ్నించారు. దీనిపై సరైన వివరణ సమర్పించాలని ఆదేశించారు.



పౌరసరఫరాల గిడ్డంగిని పరిశీలిస్తున్న కాంతారావు

పౌర సరఫరాల గిడ్డంగి లో స్టాక్ వెరిఫికేషన్ చేశారు. రైస్, దాల్, ఆయిల్ నిల్వలను తనిఖీ చేశారు. సీజ్ చేసిన బస్తాలను తనిఖీ చేశారు. హమాలీలతో మాట్లాడి ప్రతి నెలా వేతనాలు చెల్లిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రతి నెలా 10వ తేదీ లోగా వేతనాలు చెల్లిస్తున్నారని హమాలీలు చెప్పారు. రికార్డ్ లన్నింటిని అప్ డేటెడ్ గా ఉంచాలని, ఇక పై ప్రతి నెలా వస్తానని అన్నారు. లీగల్ మెట్రోలజీ, పౌర సరఫరాల, ఐసిడిఎస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఐఆర్‌టిడబ్ల్యు, సిఐటియు నాయకులు, కార్మికులు

ఏప్రిల్ 5న రవాణా రంగ కార్మికుల చలో ఢిల్లీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొనాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు తులసీరామ్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు,. ట్యాక్సులు పెంచడంతో రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ఆర్‌టిసిలో పర్మినెంట్ వర్కర్లతో సమానంగా ఔట్ సోర్సింగ్, అద్దె బస్సు డ్రైవర్లు విధులు నిర్వహిస్తున్నప్పటికీ కనీస వేతనాలు , పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాడ్యుటి, పెన్షన్ వంటి చట్టపరమైన హక్కులు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో, లారీ, క్యాబ్ వ్యాన్ తదితర డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని, బేరాలు లేక, కిస్తీలు, ప్రైవేట్ ఫైనాన్సర్లు అప్పులు చెల్లించలేక వాహనాలు వదులుకోవాల్సి వస్తుందని, ప్రమాదాలు జరిగితే డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అందుకే రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జెఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్,తిరుపతి, శంకర్, జగదీష్, రంగమ్మ, అశోక్ , తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజావసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని నగర మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం 11వ డివిజన్‌లో గోధుమపిండి పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి కార్డుకు రెండు కేజీలు చొప్పున గోధుమ పిండిని పంపిణీ చేసే కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ డిపోల తరహాలో ఇంటింటికి రేషన్ సరుకులు తెచ్చే వాహనాలను ఏర్పాటు చేసే కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుందన్నారు. ప్రస్తుతం రెండు కేజీల గోధుమపిండిని ప్రతి కార్డుదారులకు అందిస్తారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు లబ్ధి చేకూరే విధంగా గోధుమపిండి పంపిణీ కార్యక్రమం ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ డిజిఎంగా దాలినాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా దాలి నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వైహెచ్‌ఎస్ పాపారావు, అధ్యక్షులు అలుగు వెంకటరావు, కోశాధికారి కృష్ణకుమారి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా డిజిఎం మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ప్రయత్నిస్తానని, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రవిరాజు, భాను, శకుంతల, రేవళ్ల రమణమ్మ, ఎం.రమణమ్మ, లక్ష్మణ్ కుమార్, తులసి పాల్గొన్నారు

కొండను మింగేస్తున్నారు..!

- దన్నానపేటలో కొండపై అక్రమ తవ్వకాలు
- మట్టిని సైతం అమ్మేస్తున్న నాయకులు
- పట్టించుకోని అధికారులు



ఆక్రమించేందుకు చదును చేసిన కొండ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ప్రభుత్వ స్థలాలే కాకుండా కొండలను సైతం పిండి చేసి ఆక్రమించుకునేందుకు వెనుకాడటం లేదు. దర్జాగా రాత్రింబవళ్లు జెసిబిలను పెట్టి కొండను తవ్వి చదును చేసేస్తున్నా అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొండపైకి దారి వేసి లారీలతో దర్జాగా మట్టిని తరలించి అమ్మేస్తున్నారు. మట్టిని పూర్తిగా అమ్మేసిన తరువాత స్థలం చదును చేసి అమ్మకాలకు సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

మండలంలోని దన్నానపేటలోని సర్వే నెంబర్ 88లో ఉన్న కొండను అక్రమార్కులు ఆక్రమించుకొని మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. గత కొన్ని నెలలుగా కొండపైకి దారి వేసి జెసిబిలు, లారీలతో కొండను కొల్లగొట్టడమే కాకుండా మట్టిని తరలించి అమ్మేస్తున్నారు. కొండపై ఇంత జరుగుతున్నా సంబంధిత అధికార్లు కూడా పట్టించుకోకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా నాయకుల కనుసన్నల్లోనే వ్యవహారం..

కొండను తవ్వి ఆక్రమించుకుంటున్న తంతు అధికార పార్టీ నేత కనుసన్నల్లో జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దర్జాగా కొండను సైతం కబ్జా చేస్తున్నా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన స్థలాలు, కొండలు ఇష్టారాజ్యంగా అక్రమార్కులు మింగుతున్నా పట్టించుకొనే నాధుడు లేడని ఆవేదన చెందుతున్నారు.

పేద వారిపైనే అధికారుల ప్రతాపం

ఇళ్లు లేని పేదవారు ఎవరైనా ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టు కుంటే వెంటనే అధికారులు నానా యాగీ చేసి తొలగించేసి పేదవారిపై వారి ప్రతాపాన్ని చూపిస్తారు. అలాంటిది పట్టపగలు గ్రామాన్ని ఆనుకుని ఉన్న కొండను ఆక్రమించుకొని పనులు జరుపుతున్నా స్పందించక పోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరచి ఆక్రమణకు గురవుతున్న కొండను అక్రమార్కుల నుంచి కాపాడి పర్యావరణాన్ని రక్షించాలని, అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానం

శృంగవరపుకోట : రక్తదానం ప్రాణదానమని స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ కె రమేష్ అన్నారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్ స్టేషన్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో దాదాపు 45 మంది ద్వారా రక్తాన్ని సేకరించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

శృంగవరపుకోట : మండలంలోని తెన్ను బొడ్డవర 33/11 కెవి నుండి 11 కెవి కృష్ణాపురం ఫీడర్‌కు మధ్య చెట్ల నరికివేతను నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడనుందని ఎఇ రవి బుధవారం తెలిపారు. దీంతో పెద్ద కండేపల్లి, గవరపాలెం, భర్తపురం, రాయవానిపాలెం, అడ్డ తీగ, కరకవాని జోరు, దెప్పూరు, రామన్నపాలెం, రాజీపేట, యాల్లపేటలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

5 వేల ములగ మొక్కలు పంపిణీ

లక్కవరపుకోట : మండలంలోని కల్లేపల్లిలో మహిళా సంఘం సభ్యులకు బుధవారం ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు సింగపూర్ సత్యనారాయణ చేతులు మీదుగా 5వేల ములగ మొక్కలతో పాటు 500 పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఎపిఎం టి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ పూడివానిపాలెంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీ నుండి ములగ మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. దాని ఉత్పత్తులు స్వీకరించడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోకాడ ముసలినాయుడు, వైసిపి నాయకులు తూర్పాటి అప్పలరాజు, బి. అప్పారావు, భూమిరెడ్డి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్

డెంకాడ : స్థానిక లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బ్రిటిష్ కౌన్సిల్, లెండి ఇంగ్లీష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్ స్కిల్స్ ల్యాబ్ సంయుక్తంగా నిర్వహించిన మొబైల్ అసిస్టెడ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ లెర్నింగ్ అండ్ టీచింగ్ పై ఫ్యాకల్టీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారం ముగిసింది. యుకె నుండి బ్రిటిష్ కౌన్సిల్ ఇంగ్లీష్ స్కోర్ సీనియర్ అసెస్‌మెంట్స్ మేనేజర్ బెన్ కుక్ ఆన్‌లైన్ ఈవెంట్‌లో పాల్గొని ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అండ్ లెర్నింగ్‌లో మొబైల్ వాడకం యొక్క అభివృద్ధి చెందుతున్న అంశాలను గురించి ఫ్యాకల్టీని ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలోని బ్రిటిష్ కౌన్సిల్ ఇంగ్లీష్ స్కోర్ మేనేజర్ సచిన్ కుమార్ ఇంగ్లీష్ యాప్ గురించి, భాషా అభివృద్ధికి ఇది ఎలా పని చేస్తుందో ప్రస్తావించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డాక్టర్ హరిబాబు తమ్మినేని ప్రసంగిస్తూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కమ్యూనికేషన్ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉండటం వల్ల బోధనా పద్ధతుల్లో మార్పు రావాలని, మొబైల్ అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్ వంటి కొత్త విధానాలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, డాక్టర్ పరాంకుశం, అన్ని విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ ఆర్థిక సాయం

నెల్లిమర్ల : జరజాపుపేట 18వార్డు కొండల వీధిలో కొండల ప్రభావతికి చెందిన ఇల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు బుధవారం బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, స్థానిక కౌన్సిలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్‌ల మార్పు



సభలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్

నెల్లిమర్ల : కార్పొరేట్ శక్తులు లాభాల కోసమే లేబర్ కోడ్లు మార్పు చేశారని, వాటిని ప్రతిఘటించడం ద్వారానే తిప్పికొట్టాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు పి. ప్రసాద్ పిలుపునిచ్చారు. నెల్లిమర్ల అమరవీరుల స్మారక భవనంలో బుధవారం విజయనగరం జిల్లా ఐఎఫ్‌టియు మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభలు ఈ నెల 25,26 తేదీల్లో శ్రీకాకుళంలోనూ, జాతీయ మహాసభలు ఏప్రిల్ 16,17,18 తేదీల్లో తిరుపతిలోనూ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం. వెంకటేశ్వర్లు, పిఒడబ్ల్యు, అరుణోదయ, దళిత విముక్తి, పిడియస్‌యు నేతలు పాల్గొని మాట్లాడారు.

ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఎన్నిక

ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా రొంగలి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా బి. గీత, ఉపాధ్యక్షుడిగా కాళ్ళ అప్పలసూరి, కార్యదర్శిగా యస్ సూర్యనారాయణ రాజుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

బీమాతో మెరుగైన జీవన భృతులు


చెక్‌ను అందజేస్తున్న మేనేజర్ సతీష్‌కుమార్

రామభద్రపురం: ఎస్‌బిఐ బీమా పథకాలు తక్కువ ప్రీమియంతో ఎక్కువ ఫలితాలు పొందేందుకు ఉపకరిస్తాయని వీటితో మెరుగైన జీవన భృతులు సాధ్య పడతాయని స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. బుధవారం బ్రాంచ్ క్యాబిన్‌లో ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష భీమా పథకాల్లో చేరి ప్రమాదవశాత్తూ గతేడాది ఆగస్టులో పాము కాటుకు గురై మరణించిన కొత్తరేగ గ్రామానికి చెందిన చీపురుపల్లి తిరుపతికి నామినీగా ఉన్న అతని భార్య పోలమ్మకు రూ.2లక్షలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై రెండు పథకాల్లో చేరడం వల్ల బీమా అందించామన్నారు. ఇతను కేవలం రోజుకి ఒక్క రూపాయి లోపు వార్షిక ప్రీమియంగా రూ.350 మాత్రమే చెల్లించార న్నారు. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తం రావడంతో కుటుంబ పెద్దను కోల్పోయినా ఈ నగదు ఆ కుటుంబ పోషణకు చేయూత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిసి పాయింట్ ప్రతినిది పివి సత్యారావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, విజయనగరంలో
FDIA.819/2019 IN O.S.318/2017

గంట్రేటి సత్యనారాయణ. ......పిటిషనర్
యెదిరి
తుమ్మగంటి సూర్యనారాయణ. .....రెస్పాండెంట్
టు
తుమ్మగంటి సూర్యనారాయణ, తండ్రి లేటు గురునాయుడు, వయస్సు సుమారు 60 సంవత్సరములు, హిందూ, వ్యవసాయము, గొలగాం గ్రామం, గుర్ల మండలం, విజయనగరం జిల్లా.

పై నంబరు గల ఫైనల్ డిక్రీ పిటిషన్ లో పిటిషనరు, మీపై వేసిన OS.318/2017 దావాలో పొందిన ప్రిలిమినరి డిక్రీనీ అమలు పరచి, అందు చూపబడిన రిజిస్ట్రీ తనఖా ఆస్తిని అమ్మి, తన బాకీ తీర్మానము చేయమని కోరియున్నారు. సదరు పై పిటిషన్ విషయములో మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నుండి సమనులు పంపినప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక పోవడంవలన, శ్రీ కోర్టువారు ఈ పత్రికా ముఖముగా మీకు సమనులు పంపుటకై ఆదేశించి, మీ హాజరుకై సదరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌ను **తే.17.02.2023దీ** నాటికి వాయిదా వేసియున్నారు. కావున **తే.17.02.2023దీన, ఉదయం గం.10-30 ల**కు మీరు స్వయముగా గాని, లేక మీ వకీలుద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ వాదనను వినిపించుకొనవలెను. లేనియెడల లభ్యమగు రికార్డుల మూలముగా మీ పరోక్షములో తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఆదేశములతో ప్రచురించడమైనది)

కె. కృష్ణ మూర్తి,
పిటిషనర్ తరపు న్యాయవాది,
కూరెళ్ళ వారి వీధి, కొత్తపేట
విజయనగరం - 535002.
(సెల్ : 98661 85310)

వైసిపిలో బయటపడ్డ విభేదాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీ వైసిపిలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. ఎప్పటి నుంచో వర్గాలు ఉన్నప్పటికి ఎప్పుడూ బయట పడలేదు. వర్గ విభేధాలు బయట పడే సమయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జోక్యం చేసుకోవడంతో ఇంత వరకూ బయటకు రాలేదు. విభేదాలు రోజురోజుకు పెరగడంతో కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో ఒక్కసారిగా బయట పడ్డాయి. బొబ్బిలిలో మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వర్గంగా ముద్రపడిన కౌన్సిలర్లు పట్ల ఎమ్మెల్యే వర్గంగా ముద్రపడిన చైర్మన్, ఇతర కౌన్సిలర్లు చిన్నచూపు చూడడంతో కౌన్సిల్ ప్రారంభం నుంచి చాపకింద నీరులా మున్సిపాలిటీలో రెండు వర్గాలుగా వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. బొత్స, జిల్లా పరిషత్ చైర్మన్ వర్గంగా ఉన్న కౌన్సిలర్లు పట్ల చిన్నచూపు చూస్తున్నారని వారంతా చాలా కాలంగా మనో వేదనతో ఉన్నారు. అధికారులు కూడా తమకు గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. దీంతో ఇటీవల నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో విభేదాలు బయటపడ్డాయి. బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి హాజరైనప్పటికి ఎటువంటి మొహమాటం లేకుండా సమావేశంలో తమ ఆవేదనను చెప్పి కౌన్సిల్ సమావేశం నుంచి వైసిపి కౌన్సిలర్లు వాకౌట్ చేసి మున్సిపల్ కార్యాలయం పోర్టికో వద్దకు వచ్చి అవినీతి ఆరోపణలు చేశారు. అవినీతి ఆరోపణలు చేస్తున్న సమయంలో కౌన్సిలర్లకు నచ్చజెప్పేందుకు వైస్ చైర్మన్ జి.రమాదేవి ప్రయత్నించగా ఆమెపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతిపక్ష సభ్యులు పట్ల చులకన భావం

మున్సిపాలిటీలో ప్రతిపక్ష కౌన్సిలర్లు పట్ల చైర్మన్ చులకనభావం చూపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. వార్డు సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావిస్తే కనీసం వినడం లేదని సాక్షాత్తు టిడిపి కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడిపి వార్డులు పట్ల వివక్షత చూపుతున్నారని టిడిపి కౌన్సిలర్లు ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ ఆరోపిస్తు వచ్చారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే తమపై వివక్షత చూపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు.


నిరసన తెలుపుతున్న వైసిపి కౌన్సిలర్లు (ఫైల్)

చైర్మన్ ఏకపక్షధోరణి?

మున్సిపల్ చైర్మన్ ఏకపక్ష ధోరణితో మున్సిపాలిటీలో వర్గ విభేదాలు ఏర్పడ్డాయి. బొత్స, చిన్నశ్రీను వర్గంగా ముద్రపొందిన కౌన్సిలర్లకు కనీసం విలువ ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. తమ ఆవేదనను జిల్లా పరిషత్ చైర్మన్ వద్ద వినిపించిన తరువాత అందరూ కలిసి పనిచేయాలని ఆయన ఆదేశించినా తమకు విలువ, గౌరవం ఇవ్వడం లేదని కౌన్సిలర్లు ఆందోళన చెందుతున్నారు. కౌన్సిలర్లు అందరిని సమానంగా చూడాల్సిన చైర్మన్ చులకనగా చూస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన చెందుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపికి నష్టమే..

బొబ్బిలి మున్సిపాలిటీలో వర్గాలు ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా ఆ పార్టీ పట్ల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రోజురోజుకు అసంతృప్తి పెరగడంతో టిడితపికి ఆదరణ పెరుగుతుంది. స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి విజయం సాధిస్తే బొబ్బిలి నియోజకవర్గంలో వైసిపి స్పీడ్‌కు టిడిపి బ్రేకులు వేసింది. అప్పటిలోనే రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని సాక్షాత్తు వైసిపి నేతలే చర్చించుకున్నారు. ఈ తరుణంలో మున్సిపాలిటీలో వర్గ విబేధాలు మూలుగుతున్న నక్కపై తాటిపండు పడ్డ చందగా వైసికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

మున్సిపల్ చైర్మన్ రాజీనామా చేయాలి : టిడిపి

సొంత పార్టీ కౌన్సిలర్ల నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు తన పదవికి రాజీనామా చేయాలని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కోటలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజా పాలన, అభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. సొంత పార్టీ కౌన్సిలర్లు అవినీతి ఆరోపణలు చేశారంటే అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులను గౌరవించే సంస్కారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు వలనే బొబ్బిలిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధిలో చైర్మన్ పాత్ర లేదన్నారు. అభివృద్ధిలో విఫలమై, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ బి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోలేని వ్యక్తికి ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని చైర్మన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. తాము ప్రజల చేత ఎన్నుకోబడ్డామని, అందుకే కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించినా చైర్మన్ పట్టించుకోవడం లేదని అన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ బి.సురేష్ మాట్లాడుతూ వార్డు సమస్యలపై ఒక దళిత మహిళా కౌన్సిలర్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తే కనీసం కౌన్సిలర్‌ను గౌరవించే సంస్కారం లేకపోవడం విచారకరమన్నారు. అవినీతి ఆరోపణలకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అపరాలకూ ఇ-క్రాప్ : కలెక్టర్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

ప్రతి రైతూ తాను పండించిన పంటకు ఈ క్రాప్ చేయించే విధంగా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూర్యకుమారి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆమె రైతులతో మాట్లాడుతు ఏయే సీజన్లలో ఏయే పంటలు వేస్తున్నారని ఈ క్రాప్ చేయిస్తున్నారా? లేదా అని ఒక్కో రైతు వద్ద నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రాప్ చెయ్యడం వల్ల జరిగే ప్రయోజనాలను రైతులతో చెప్పించారు. మండలంలో 22 మంది రైతులతో ఆమె నేరుగా మాట్లాడారు. ప్రతి సీజన్‌లో ప్రతి పంట, ప్రతి రైతునకూ నమోదు చెయ్యాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ యం.శ్యాం సుందర్, తహశీల్దార్ రాజారావు, సచివాలయ వ్యవసాయ సహాయ ం౦ంకులు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలో అపరాలు సాగుచేస్తున్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ క్రాప్‌లో వారు వేసే పంట నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికంగా అపరాలు సాగు చేస్తున్న కొండ కెంగువ, జీలుగు వలస, జన్నివలస వంటి గిరిశిఖర ప్రాంత రైతులు ఈ క్రాప్ నమోదు వివరాలు తనిఖీ చేశారు. వరి సాగు తరువాత వేసవి పంటలుగా సాగుచేసే మినుము,పెసర, కంది, రాగులు వంటి అపరాల పంటలు ఈ క్రాప్‌లో నమోదు చేసిన వాటికే మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. వరి పంట కొనుగోళ్లు ఆశా జనకంగా ఉన్నాయని బిల్లులు కూడా త్వరిత గతిన జమ అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెడుతున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా 104లో వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు ఇంటింటా అందించాలని గిరిశిఖర ప్రాంతాల్లో సక్రమ వైద్య సేవలు జరగాలని అక్కడ ప్రజలకు పోషకాహార విలువలు తెలియు జేస్తు రక్త హీనత లేకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సుఖ ప్రసవాలు జరిగేందుకు గర్భిణీలకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఇంటర్ చదివి మధ్యలో ఆపేసిన వారిని గుర్తించి వృత్తి విద్యా శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఒ రమామణికి సూచించారు.


రామభద్రపురం: రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

గృహ సారథులే గెలుపునకు వారధులు

దత్తిరాజేరు : గృహ సారథులే తన గెలుపునకు వారధలని ప్రతి ఒక్కరూ తన గెలుపును కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతోపాటు, ఇంటింటికి అందజేసిన పథకాలను ప్రతి ఇంటికి తెలియజేసి వారి అభిమానాన్ని ఓట్లుగా మలిచేలా వాలంటీర్లు, గృహ సారథలు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలన్నారు. తౌలుత పోరలి గ్రామంలో రూ.15 లక్షలతో ఉద్యాన పంటల సేకరణ కేంద్రం నిర్మించేందుకు స్థానిక సర్పంచ్ మిత్తి రెడ్డి ధనలక్ష్మితో కలిసి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అందరి సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

శృంగవరపుకోట : ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ధర్మవరం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మండల పార్టీ అధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జయంతి అన్నారు. బుధవారం కోటిపల్లి గ్రామంలో అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్ ను ఆమె పట్టుకున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెల్మెట్ ధరించాలని పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి- రేగిడి

వాహనదారులు హెల్మెట్ ధరించి, ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఉంగరాడ మెట్ట వద్ద వాహనదారులు, పోలీస్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసిన సమయంలో అనుకోకుండా ప్రమాదాలు జరిగితే కుటుంబం వీధిన పడుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. అప్రమత్తంతోనే ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. ఎస్ఐతో పాటు సిబ్బంది శివ ఉన్నారు.

వేపాడ : మండలంలో వల్లం పూడి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు హెల్మెట్ ధారణపై బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన తెలిపారు.


ఎస్‌కోట: ర్యాలీ చేస్తున్న పోలీసులు

శృంగవరపుకోట: రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుండి దేవి కూడలి వరకు ఎస్ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది హెల్మెట్‌లను ధరించి బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు అవయవాలకు దెబ్బలు తగిలినప్పటికీ ప్రాణం పోకుండా హెల్మెట్ తలకు రక్షణగా ఉంటుందని కనుక ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: హెల్మెట్‌తో ప్రాణ రక్షణ పొందవచ్చునని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు అన్నారు. హెల్మెట్ ధరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదలలో గాయపడి మరణిస్తున్న వారిలో ఎక్కువమంది హెల్మెట్ దరించని వారే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జామి : రోడ్డు రవాణా భద్రతలో భాగంగా హెల్మెట్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్.ఐ వీరబాబు ఆధ్వర్యంలో భీమాసింగి ప్రధాన కూడలి వద్ద ర్యాలీ నిర్వహించగా, పోలీసులతో పాటు స్థానిక వాహన చోదకులు పాల్గొన్నారు.

బిసిల పట్ల కేంద్రం వివక్ష

ప్రజాశక్తి- బొబ్బిలి

కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం బిసిల పట్ల వివక్ష చూపుతుందని వెనుకబడిన కులాల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వంగపండు శ్రీరాములనాయుడు, వేమిరెడ్డి లక్ష్మి నాయుడు, రాంబార్కి తిరుపతిరావు అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ దేశ జనాభాలో బిసిలు 54శాతం పైగా ఉన్నా విద్య, ఉద్యోగాలలో 27శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నారు. కేంద్ర పాలకులు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారే తప్ప వారికి ఎటువంటి మేలూ చేయడం లేదన్నారు. తక్షణం జనగణన చేపట్టి జనాభా నిష్పత్తి ప్రకారం (దామాసాగా) విద్యా, ఉద్యోగతాలు, ఎస్‌సి, ఎస్‌టిలకు కల్పించినట్లు చట్టసభలలో ఈబిసి వారికి రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు రవి, బలరాం నరసింహనాయుడు, కాంగ్రెస్ పార్టీ డిసిసి నెంబర్ శ్రీనివాసరావు, కొత్తపెంట సత్యంనాయుడు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.


షెడ్‌లను పరిశీలిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

ఎస్‌డబ్ల్యుపి షెడ్‌పై అవగాహన

వేపాడ : మండలంలోని కృష్ణ రాయుడుపేటలో ఎస్‌డబ్ల్యూపి షెడ్ ఉపయోగం గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ. పిఆర్ మండల ఇంజనీరింగ్ అధికారి మహమ్మద్ కుర్షిద్ ఆలీ, గ్రామ సర్పంచ్ చెలిబోని బాలబాబు పాల్గొన్నారు. అనంతరం కొంపల్లిలో పింఛన్లను పంపిణీ చేశారు.

ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తారా ?

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్రంలో ప్రజలకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలకు పంపిస్తారా అంటూ మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గంలో టిడిపి ఇంఛార్జి కొండ్రు మురళీ అన్నారు. తాటిపాడు గ్రామంలో ఇదేం కర్మ మన ప్రభుత్వానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నవరత్నాలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. 45 ఏళ్ల దాటిన మహిళలకు పెన్షన్లు ఇస్తామని చెప్పి మహిళల ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ఈ మహిళలే రానున్న 2024 ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. లోకేష్ పాదయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావడంతో వైసిపిలో గుబులు మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, రమేష్ నాయుడు, బాలి రామినాయుడు, ధనుంజయరావు, మహేశ్వరరావు, లావేటి సత్యనారాయణ, టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళి

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

భవన నిర్మాణ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిఐటియు, భవన నిర్మాణ సంగం ఆధ్వర్యంలో బుధవారం అలజంగి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క శాతం చెస్ రూపంలో వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయలను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు పెట్టకుండా మోసం చేస్తున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో ఉన్న వందల కోట్ల రూపాయలు నవరత్నాలకు మళ్లించి భవనిర్మాణ కార్మికులకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నందన్నారు. భవన నిర్మాణ కార్మికులు సంక్షేమానికి ఖర్చు పెట్టాలని సుప్రీంకోర్టు అనేకమార్లు రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించిన మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు బడ్జెట్‌లో మొండి చేయి చూపించిందని దేశ ఆదాయంలో నిర్మాణ రంగం నుండి 22 శాతంగా ఉన్న నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 6 చలో ఢిల్లీ కార్యక్రమం దేశవ్యాప్తంగా చేపడుతున్నామని భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రెసిడెంట్ ఆచారి, కార్యదర్శి బి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 1436/2018 OS 477/2009

Between :
Valle Suryanarayana (died) and others ....Plaintiffs
And:
Valle Satyam & others ...Defendants
Notice to
R5 : నడిపేన సన్యాసి, H/o నడిపేన చిన్నయ్యమ్మ, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R6 : నడిపేన అనూష, D/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R7 : నడిపేన కోటేష్, S/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో మీకు అనేకసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు పిటిషన్ మీకు నోటీసు నిమిత్తం **తే 06-02-2023దీ**కి వాయిదా ఉన్నది. కావున సదరు పిటిషన్‌లో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే 06-02-2023దీన ఉదయం 10-30 నిముషాల**కు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మాణించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram,
Cell: 9441053628

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 460/2022 OS 477/2009

Between :
Valle Suryanarayana (died) and others ....Plaintiffs
And:
Valle Satyam & others ...Defendants
Notice to
R5 : నడిపేన సన్యాసి, H/o నడిపేన చిన్నయ్యమ్మ, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R6 : నడిపేన అనూష, D/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R7 : నడిపేన కోటేష్, S/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో మీకు అనేకసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు పిటిషన్ మీకు నోటీసు నిమిత్తం **తే 06-02-2023దీ**కి వాయిదా ఉన్నది. కావున సదరు పిటిషన్‌లో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే 06-02-2023దీన ఉదయం 10-30 నిముషాల**కు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మాణించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram,
Cell: 9441053628

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 461/2022 OS 477/2009

Between :
Valle Suryanarayana (died) and others ....Plaintiffs
And:
Valle Satyam & others ...Defendants
Notice to
R5 : నడిపేన సన్యాసి, H/o నడిపేన చిన్నయ్యమ్మ, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R6 : నడిపేన అనూష, D/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.
R7 : నడిపేన కోటేష్, S/o సన్యాసి, ఎరుకొండ గ్రామం, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో మీకు అనేకసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకోనందున సదరు పిటిషన్ మీకు నోటీసు నిమిత్తం **తే 06-02-2023దీ**కి వాయిదా ఉన్నది. కావున సదరు పిటిషన్‌లో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే 06-02-2023దీన ఉదయం 10-30 నిముషాల**కు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ మీ పరోక్షమందు తీర్మాణించబడును.

ఇట్లు
J.Bheemasena Rao
Advocate for Petitioner
Vizianagaram,
Cell: 9441053628

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ ప్రతిష్ట

డెంకాడ :మండలంలోని కొండ్రాజుపేట గ్రామంలో దుర్గాలమ్మ ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన శిలా పలకాన్ని బుధవారం నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవ రావు, స్థానిక సర్పంచ్ సరగడ కల్యాణి, సరగడ బంగారు రెడ్డి పాల్గొన్నారు.


డెంకాడ: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వైభవంగా తీర్థ మహోత్సవం

వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామంలో చంద్రమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం వైభంగా జరిగింది. ఆకులు సీతంపేటలో శ్రీ వివేకానందస్వామి తీర్థ మహోత్సవం భక్తి భావంతో నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని పూజలు చేపట్టారు.

నేడు ఆలయం వార్షికోత్సవం

మండలంలోని పాటూరులో దుర్గా పార్వతమ్మ ఆలయం 16వ వార్షికోత్సవం గురువారం నిర్వహిం చనున్నారు. తెల్లవారు జామున 5 గంటల నుండి పాలభిషేకం, ప్రత్యేక పూజలను బి.హరిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. 11 గంటలకు సామూహిక కుంకుమార్చన నిర్వహించి అన్నదానం చేపడతారు.

ఇంద్రకంటి గోపాలకృష్ణ సాహిత్య గోష్ఠి

కొత్తవలస: మండలంలోని చింతలపాలెంలో శ్రీ చిట్టిపాప తీర్థ మహోత్సవం సందర్భంగా ఇంద్రకంటి గోపాలకృష్ణ సాహితీ గోష్ఠి బుధవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ మాకెన్ సీతారామ పాత్రుడు ఆధ్వర్యంలో జరిగిన జాతరలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఏటా ఇలా జరపడం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యానిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల రాంప్రసాద్, వసంత్ విహార్ అధినేత జయప్రకాష్ బాబు, పాల్గొన్నారు.

గౌరి శంకర కళ్యాణ మహోత్సవం

మెంటాడ : మండలంలోని జయతి గ్రామంలో బుధవారం శివగిరిపై వెలిసిన గౌరీ శంకరుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున ఈ కల్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ముచ్చర్ల రామచంద్ర నాయుడు కుటుంబీకులు కల్యాణాన్ని వైభోగం కన్నుల పండుగగా జరిపించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం గౌరీశంకర్‌లను ఊరేగింపుగా తిప్పుతారు.